# పిల్లాడి కోసం... చిరుతపై శివంగిలా

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org



కన్నబిడ్డను చిరుత నోటకరచుకుపోతుంటే ఆ తల్లి పేగు తల్లడిల్లింది. వెనుకాముందు ఆలోచించకుండా చిరుతపై శివంగిలా దాడికి దిగింది. బిడ్డను ప్రాణాలతో కాపాడుకుంది. ఆ ప్రయత్నంలో తాను చిక్కుకున్నా ధైర్యాన్ని వీడలేదు. చిరుతపై దాడి చేస్తూనే, మరో వైపు ఊరి ప్రజలను అప్రమత్తం చేసేలా అరిచింది. అందరూ అక్కడికి వచ్చేసరికి చిరుత వెనుకడుగు వేసింది. ఆ సాహసానికి పూనుకున్న ఆమే థోల్‌వాడ్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల దీపాలి.

పుణెకు 90 కిలోమీటర్ల దూరంలోని ఓట్టూరు సమీపంలో జున్నార్‌కు దగ్గరగా ఉండే చిన్నగ్రామం థోల్‌వాడ్. చెరకు పండించే ప్రాంతం కావడంతో చెరకు కోయడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అక్కడికి కూలీ పని కోసం చాలా కుటుంబాలు వలస వస్తాయి. వారంతా సమీపంలోని పుష్పవతి నదీతీర ప్రాంతంలో చిన్నచిన్న గుడిసెల్లో తాత్కాలికంగా నివసిస్తారు. అలా నాసిక్, మాలేగావ్ తాలూకా నుంచి కూలీ కోసం దీపాలీ కుటుంబం గతేడాది ఇక్కడకు చేరుకుంది. భర్త దిలీప్‌తో కలిసి దీపాలీ కూడా కూలీ పని చేస్తోంది. వీరికి ఏడాదిన్నర కొడుకు ధానేశ్వర్ మాలి ఉన్నాడు. గత శనివారం రాత్రి గుడిసె బయట నిద్రపోతున్న దీపాలీకి అర్ధరాత్రి సమయంలో ఏదో చప్పుడు వినిపించి కళ్లు తెరిచింది. తన పక్కన నిద్రపోయే కొడుకు చిరుత కోరల మధ్య ఉండటం చూసింది. ‘ఒక్కసారిగా భయపడ్డా. నా కొడుకు తల చిరుత నోట్లో ఉంది. దాంతో ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా వెంటనే చిరుతపై దాడికి దిగా. నా దగ్గర ఏ ఆయుధం లేకపోవడంతో చేతులతోనే కొట్టడం ప్రారంభించా. ఆ సమయంలో నా బిడ్డను కాపాడుకోవాలనే ఆలోచన తప్ప అది చిరుత అనే భయం కూడా లేదు. కాసేపటికి ఆ చిరుత నా బిడ్డను వదిలేసి... నాపై దూకింది. నాపై దాడి చేసేందుకు ప్రయత్నించింది. ఓ వైపు చిరుతను కొడుతూ, నన్ను నేను రక్షించుకుంటూ, అరవడం ప్రారంభించా. నేనూహించినట్లుగానే అందరూ అక్కడికి చేరుకున్నారు. దాంతో చిరుత భయపడి, అడవిలోకి పారిపోయింది. మా వాడి తల, ముఖమంతా రక్తం. నా చేతులకు బాగా గాయాలయ్యాయి. అయితే నా బిడ్డను కాపాడుకున్న ఆనందం చాలు నాకు. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి, మా ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించారు. ఆ తరువాత యస్వంత్రో చావన్ మెమోరియల్ ఆసుపత్రిలో చేర్పించారు. కొన్నిరోజుల క్రితం ఇలాగే చిరుత ఓ చిన్నారిపై దాడిచేసి చంపేసింది. అందుకే ప్రాణాలకు తెగించి నా బిడ్డను కాపాడుకోవడానికి ఎదురు తిరిగా’ అని అంటోంది దీపాలి.